# ప్రేమను ప్రేమించు

– ఎం.ఎల్.సూర్యకాంతం

ఆరోజు ఎప్పటిలాగే చాలా అందంగా, ఆహ్లాదంగా సూర్యోదయమైంది. జాహ్నావికి మాత్రం మామూలు సూర్యోదయంలా లేదు. తనను నరకానికి తీసుకెళ్ళేందుకు సిద్ధపడిన యమదూత ఆగమనంలా ఉంది. దానిక్కారణం ఆరోజు అత్తవారింటికి వెళ్ళేరోజు.

భర్త ప్రేమగలవాడే. ఆ విషయంలో ఆనందంగా ఉన్నా- అక్కడ అత్త, ఆడబిడ్డల మధ్య ఎలా ఉండగలనో- వాళ్ళు నన్ను ఎలా వేధిస్తారో అన్న దిగులు. కానీ ఆ దిగుల్ని ఓ పక్కకి నెట్టి పైకి నవ్వుతూనే అన్నీ సర్దుకుంటోంది.

అంతలోనే 'నాకేం భయం? నా తడాఖా చూపించాలి. అక్కలాగ తను పిరికిపంద కాదు. తను వాళ్ళకి బానిసగా వెళ్ళటంలేదు. ఇంటి కోడలుగా వెళ్తున్నాను. నన్ను ఏమాత్రం కించపరిచినా, వేధించినా తగిన బుద్ధి చెప్తాను'' అనుకొంది ధైర్యంగా.

భర్త శ్రీధర్ ఆంధ్రాబ్యాంకులో ఉద్యోగి. అత్తగారు మున్సిపల్ హైస్కూల్లో హెడ్ మిస్ట్రెస్. మామగారికి పొరుగూళ్ళో వేరే ఆఫీసులో పని. ఆడబిడ్డ డిగ్రీ చదువుతోంది. 'వీళ్ళందరికీ సేవలు చెయ్యాలేమో! తనేం తెలివి తక్కువదా? వీళ్ళకి సేవలు చేయడానికి?' అనుకుంది అక్కసుగా.

ఆమెకి అత్తవారింటిపై అంత ద్వేషం పెరగటానికి కారణం, ఆమె అక్క సంసారం కళ్ళారా చూడటమే. అనుక్షణం త్రాగుబోతు భర్తతో, అత్త, ఆడబిడ్డల వేధింపులకు గురై తల్లిదండ్రులకు చెప్పలేక, టార్చర్ భరించలేక చివరికి ఒకరోజున ఆ పల్లెటూళ్ళోనే అగ్నికి ఆహుతైపోయింది.

అది జాహ్నావి హృదయంలో చెరగని ముద్రగా మిగిలిపోయింది. అందుకే ఆడపిల్లలకి అత్తవారిల్లు ఒక నరకకూపం అనే భావం నాటుకుపోయింది. తన అత్తవారింటిపై కూడా కసిని, ద్వేషాన్ని పెంచింది. వాళ్ళనెలా ఎదిరించాలో, హింసించాలో ముందుగానే ప్లాన్ చేసుకుంది.

సాగనంపడానికి వచ్చిన ప్రాణస్నేహితురాలు సుజాత ఆమె మనఃస్థితిని గమనించి ''జానూ.. అందరూ ఒకేలా ఉండరు. మీ అత్తగారు పనిచేసే స్కూల్లోనే మా పిన్ని టీచరు. వాళ్ళ కుటుంబం చాలా మంచిదట. నువ్వేం దిగులుపడకు'' అంది అనునయంగా.

ఆమెని పిచ్చిదాన్ని చూసినట్టు చూసింది జాహ్నావి. ''చూడడానికంతా మంచివాళ్ళేనే. కోడలి దగ్గరే వాళ్ళ బుద్ధి బయటపడుతుంది. అయినా నేను భయపడటంలేదే. వాళ్ళు వేధించేవాళ్ళయితే వాళ్ళకి తగ్గ గుణపాఠం నేర్పుతా'' అంది కసిగా.

''వాళ్ళు నీ అక్క అత్తవారు కాదే. అది గుర్తుంచుకో'' అంది నచ్చచెప్తూ.

''కోడలి దగ్గర అందరూ ఒకటేనే. నాకు నువ్వేం హితబోధ చెయ్యకు. నీలాంటివాళ్ళు ఉండబట్టే అత్తలు ఇలా రెచ్చిపోతున్నారు'' అంది కోపంగా.

''సరే.. నీ ఇష్టం. నీకే కష్టం వచ్చినా స్నేహితురాలున్నదని నన్ను గుర్తుంచుకో'' అని ఆప్యాయంగా భుజం తట్టింది.

• • •

గేట్లోకి ఎదురొచ్చి 'హాయ్ వదినమ్మా' అన్న ఆడబిడ్డ విమలని సందేహంగా చూసింది. గడప దగ్గరకొచ్చాక ''కుడి కాలు పెట్టి రామ్మా జాహ్నవీ'' అన్న అత్తగార్ని 'ఎంత ప్రేమ, ఎంత నటన' ఈ అత్తలకు అనుకుంది. భర్త శ్రీధర్, విమల, మామగారు, అత్తగారూ సరదా మనుషుల్లాగే కనిపిస్తున్నారు. అయినా 'అప్పుడే నమ్మకూడదు వీళ్ళని' అనుకుంది. అంత కల్సి కూర్చుని జోకులేసుకుంటూ వంటకాలు కొసరి కొసరి వడ్డించుకుంటూ తినేసరికి రాత్రి పది గంటలయింది. తమకు కేటాయించిన బెడ్‌రూమ్‌లోకి వెళ్ళిపోయారు శ్రీధర్, జాహ్నవిలు.

• • •

వంటింట్లోంచి పాల కుక్కర్ గోలకి తుళ్ళిపడి లేచింది జాహ్నవి. గోడ గడియారం ఏడున్నర చూపిస్తోంది. పక్కన శ్రీధర్ లేడు. 'నన్ను లేపనేలేదు' అని లేవబోయి ఏదో గుర్తొచ్చినదానిలా 'అప్పుడే ఎందుకులే' అని పడుకుని కళ్ళు మూసుకుంది బలవంతంగా. పాల కుక్కర్ ఆగింది, రైస్ కుక్కర్ విజిల్స్ అయ్యాయి. మిక్సీ మోత కూడా అయిపోయింది. అంటే వంట మొత్తం ముగిసిందన్నమాట. బాత్‌రూమ్ దగ్గర వాషింగ్ మెషీన్ చప్పుడు వినిపిస్తోంది. ఇహ బాగోదని లేచి ఎటాచ్‌డ్ బాత్‌రూమ్‌లో స్నానం ముగించి ముస్తాబై తీరిగ్గా బయటికొచ్చింది.

వంటింట్లో అత్తగారి కసరత్తు- ట్యూబ్‌తో నీళ్ళు పడుతూ, కుండీల్లో మొక్కలు తడుపుతూ మామగారు- విమల వాషింగ్ మెషీన్‌లో బట్టలు తీసి ఫ్రెష్ వాటర్‌లో గుంజుతుంటే- శ్రీధర్ అవన్నీ తీగపై వేసి క్లిప్పులు పెడుతున్నాడు. జాహ్నవిని చూసి చిన్నగా నవ్వుతూ ''గుడ్ మాణింగ్ మేడమ్'' అన్నాడు. చిన్నగా నవ్వి ఊరుకుంది. అక్కడ తనేం చెయ్యాలో అర్థంకాలేదు. వంటింట్లోకి నడిచింది. అత్తగారు టిఫిన్ ప్లేటు ముందుంచి ''తినమ్మా'' అంది.

అందరి స్నానాలు అయ్యాయి. వంటింట్లోకి వచ్చి ఎవరి బాక్సు వాళ్ళే సర్దుకున్నారు. హాట్ బాక్స్‌లోని ఇడ్లీలు ప్లేటులో పెట్టుకుని తిని, ఖాళీ ప్లేటులు సింక్‌లో వేసేశారు. అత్తగారు స్నానానికి వెళ్ళి వచ్చేసరికి మామగారు అందరికీ 'టీ' పెట్టారు. ఇక బాగోదని జాహ్నవి లేచి టీ వడపోసి కప్పుల్లో పోసి ఇచ్చింది. తొమ్మిదిన్నరకల్లా అందరూ తయారై ఎవరిమటుకు వాళ్ళు వెళ్ళిపోయారు.

వెళ్తూ వెళ్తూ ''అమ్మా జాహ్నవీ.. నీకు బోర్ అనిపిస్తే ఈ షెల్ఫ్‌లో బుక్స్ ఉన్నాయి చదువుకో. టి.వి ఉండనే ఉంది కదా'' అంది అత్తగారు. శ్రీధర్ కళ్ళతోనే సైగచేసి వెళ్ళిపోయాడు. ఒక్కసారి ఇల్లంతా తిరిగి చూసింది. చెయ్యడానికి ఏ పనీ మిగిలలేదు. అన్నీ ఎక్కడివక్కడే సర్ది ఉన్నాయి. ఇది మొదటిరోజు కదా! అందుకే నాకే పనీ మిగల్చలేదు అనుకుంది.

బుక్స్ ఏమైనా తిరగేద్దామని షెల్ఫ్ దగ్గరకెళ్ళింది. అన్నిరకాల పుస్తకాలు అందంగా పేర్చి ఉన్నాయి. ఒక చిన్నసైజు లైబ్రరీలా వుంది. చిన్నపిల్లల పుస్తకాల నుండి వ్యక్తిత్వ వికాసాన్ని కలిగించే బుక్స్ వరకూ వున్నాయి. ఒక్కొక్కటీ తిరగేస్తుంటే ఆమెకి ఎన్నడూ తెలియని, ఊహించని విషయాలు ఎన్నో అర్థమయ్యాయి. విజ్ఞాన సంపద అంతా ఒకచోట కుప్పగా పోసినట్టుగా ఉన్నాయి.

నెలరోజులు గడిచినా భర్త, విమల, అత్తగారి నుండి ఎలాంటి విమర్శలూ రాలేదు. తన ఉనికినే గమనించనట్టు ఎప్పటిలాగే ఎవరి పని వాళ్ళే చేసుకుంటున్నారు. తనపై ఎవరూ ఆధారపడరని తెల్సుకుంది. వాళ్ళు ఏదైనా సాధిస్తే ఎదురు సమాధానం చెప్దామనీ, అణిగి మణిగి ఉండకూడదనీ అనుకుంటే ఎవరూ ఏమీ అనటంలేదు.

విమల స్నేహితురాల్లాగా సరదాగా కాలేజీ కబుర్లు చెప్తుంది. అత్తగారు కూతురితో సమానంగా అన్నీ తెస్తుంది. ఇంటిపని సమస్యే కాదు వాళ్ళకి. సాయంత్రం అందరూ వచ్చాకనే మళ్ళీ వంట. తనూహించినట్టుగా ఎవరూ హింసించి సాధించడం లేదు. ప్రేమను పంచి తనలో ప్రేమను పెంచారు. తన అత్తగారు నిజంగా సినిమాలో అన్నపూర్ణలాంటిది. అత్తగారి పట్ల ద్వేష భావాన్ని పెంచుకున్న తనది ఎంత పొరపాటు అనుకుంది జాహ్నవి. ఇంత మంచి మనుషుల మధ్య సోమరిలా తిని కూర్చోవడం తనకే ఏదోలా ఉంది.

ఆడ, మగా భేదం లేకుండా ఇంటి పనుల్లో సహాయం చేసే భర్త, మామగారి పట్ల ఎనలేని గౌరవం కల్గింది. వాళ్ళనలా నడిపించగలిగిన అత్తగారి పట్ల ప్రేమభావం పొంగింది. ఇంతటి సంస్కారవంతులనా తను ఎలాగో ఊహించుకుంది అని సిగ్గుగా అనిపించింది.

'ఉన్న కొద్ది సమయం ఒకరినొకరు సాధించుకునే కంటే ఆనందంగా గడపడం మంచిది' అనే విషయం తెల్సుకున్న చిన్న కుటుంబం అది. ఇది నా పనికాదు ఆడవాళ్ళ పని అన్న ఉద్దేశ్యం ఎవరికీ లేదు. తన అత్తవారి మంచితనం చూసిన జాహ్నవి మనసులో మలినమంతా పోయింది. వారి మంచితనంలో సగమున్నా తన అక్క జీవితం విషాదంగా ముగిసిపోయేది కాదు అని బాధపడింది. 'వీళ్ళంతా నావాళ్ళు, వీళ్ల కోసం నేను కష్టపడితే బానిసను ఎలా ఔతాను? ఈ కుటుంబ సభ్యురాలిగా నాకూ బాధ్యత ఉంది' అనుకుంది హాయిగా. ఆరోజు జోరుగా పడిన వర్షంలో చెడు ఆలోచనలు కొట్టుకుపోగా, భర్త కౌగిలిలో జాహ్నవి ఆనందంగా ఒదిగిపోయింది.

★